# చదరంగపుటాల్జీబ్రా

ప్రపంచ చతురంగ పోటీలు కావు కాని మా ఇంట్లో మేమంతా చతురంగ ప్రవేశం చేయాలి సొచ్చింది. బాబీ, స్పాస్కీల పేర్లు నిత్యం రామనామస్మరణే - ఎక్కడో అయిసులాండట- అక్కడ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు పోటీలు జరగడమేమీ, యిక్కడ మేము బుజాలు ఎగరెయ్యడమేమి? ఏమిటో ప్రపంచం చాలా చిన్నదయి పోతూంది ఎవరో అన్నట్లు - రోజూ పొద్దున్నే పేపరు రాంగానే టార్జాన్ కూడా చూడటం మానేసి వెనక్కు తిప్పి "ఇవాళ గేం" ఎలా ఆడారు, ఏం జరిగింది అని ఆత్రంగా చూడందే కాఫీ కూడా గుటకెయ్య బుద్ధి కావడంలేదు. పీకేఫోర్, పీకేబిత్రీ, పీక్యూఫోర్ లంటూ చదరంగపు టాల్జిబ్రా భాషరాని వాళ్ళు డంగై పోవడంకష్టం. ఇప్పుడిప్పుడే చదరంగం ఆట తెలీకపోవడం, క్రికెట్ ఆట చూడటం రాకపోవటమంత నేరమై కూర్చుంది. ఇది మేధావులాడే ఆట కావటం వలన చదరంగంగాని పేకాట మిత్రులు ఈ మాట్లాడుకుంటూంటే, చిన్న మొహం చేసుకుంటున్నారు. అందులో అస్తమానం బాబీఅల్లా ఆడాడు, స్పాస్కీఇల్లా ఆడాడు ఆ బంటు తోయడం తప్పు, ఈ ఏనుగుల్ని ఋలా వేయకుండా వుండాల్సింది అంటూ నోటికొచ్చినట్లు ప్రేలుతున్నప్పుడు ఈ ఆటరానివాళ్ళ ముఖాలు వచన కవిత్వం అర్థంకాని పాఠకుల ముఖాలకిమల్లే వెల వెల బారుతున్నాయి. ఎక్స్‌ప్రెస్‌లో వేసిన ఆట

భోగట్టా ప్రకారం బిల్లమీద బలగాన్ని పేర్చి ఆడుకోవటం ఒక ఏకాం తపు సరదా అయిపోయింది.

ఈ గేములు డ్రా కావటం గురించి చర్చించుకునేప్పుడు చాలామంది ఆట రానివాళ్లు దీని పరిభాష విని "చదరంగపు టాల్జీబ్రా" కామోసనుకుని, మనం వెనకబడిపోయామే అని నాలిక్కర్చుకుంటున్నారు గాభరాగా.



పేకాట గొప్పదా చదరంగవా అన్న ప్రశ్న చచ్చు ప్రశ్న. దీని మాహాత్మ్యం ముందు యితర ఇండోర్ గేమ్సన్నీ దిగదుడుపే-ఈ ఆటలో రాజ్యాలు పోతాయి, హత్యలు జరుగుతాయి—జయాపజయాలకు— ఆడవారిదే బాధ్యత పూర్తిగా. చూడండి క్రికెటువాళ్ళు పిచ్చి బాగులేదు. వర్షంపడింది, బంతి బరువు సరిగా లేదు అని సవాలక్ష కారణాలు చెప్పొచ్చు. చదరంగా నికి వాతావరణంలోని మార్పులతో సంబంధంలేదు. ఇందులో లక్కు ప్రసక్తి అసలేలేదు. వ్యక్తిగతమైన తెలివి, ప్రతిభ ముఖ్యం. తప్పాడితే క్షవరమయిపోతుంది. ఎక్కడ ఆడినా నెగ్గడానికి ఇద్దరికీ సమానావకాశా లున్నాయి. పేకాటలో అల్లాకాదే— ముక్కలు కలవాలి - ముక్కలు పడక పోవడం అనే పెంట ఓటి ఉంది. అంచేత దీన్ని రాయల్‌గేం అన్నారు

దాన్ని అట్ట ముక్కల్తో ఆడే కార్డ్సుగేం అన్నారు. పేకాటలో ఆస్తులు పోతాయి, ఇందులో మతులే పోతాయి. ఒకమాటు చదరంగం బల్ల బలం కొంటే మరిక కానీ ఖర్చుండదు. ఇంత కారుచవక గేం తెల్లార్లూ ఆడు కుందికి మరోటి లేదు—

"తోసిరాజు—ఆటకట్టు" అనే సామెతను విరివిగా వాడేస్తూంటాం. చదరంగం ఎవరికైనా ఇట్టే వస్తుంది. అదేం బ్రహ్మ విద్య కాదు. చాలా తేలిగ్గా నేర్చుకోవచ్చు. కాని జీవితంలో అన్ని విషయాలలో లాగే మంచి పార్టనర్ లేకుండా ఆడటం కష్టం, అన్ని బాధల్ని మర్చిపోడానికి, ప్రపం చానికి దూరం కావటానికి 'చదరంగం' ఆట ఒక గొప్ప పలాయన సూత్రం.

భగవంతుడైన శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతలో బోధించిన తత్వమే చదరంగపు టాటకున్న ఫిలాసఫీ. కొట్టు, నరుకు, చంపు - నువ్వు నిమిత్త మాత్రుడివి. ఎవరెల్లాటి ఎత్తులువేస్తే వారికలాటి ఫలితం దక్కుతుంది. బంటుని చంపలేని వాడివి మంత్రిని చంపలేవు. మంత్రిని రక్షించుకోలేని వాడివి రాజు నెలా రక్షించుకోగలవు. ఆటలో కాని జీవితంతో కాని తప్పు చేయకు. తప్పుచేసి గెలవడం కష్టం. ఆత్మరక్షణ చేసుకోవడం తెలియక పోతే జీవితంలో అస్తమానూ ప్రతివాడిచేతా 'షా' అని అనిపించుకోవలసి వస్తుంది. పోనీ కలబడి పోరాటం సాగిద్దామంటే అటోఇటో తేలిపోతుంది. జీవితంలో కూడా జాగ్రత్తగా ఆత్మరక్షణ చేసుకుంటూ వుండాలా ? జీవి తాన్ని ఎదుర్కొని పందెం ఒడ్డినట్టు పోరాడాలా ?

జీవితంలో మనం ఆలోచిస్తే అన్నీ ఎత్తులు కాక మరేవిటి ? ఒకప్పుడు రాజులా రాజాగా వుండాలనుకుంటాం. మన దగ్గరకి ఎవర్నీ రానివ్వం. వచ్చాడా చచ్చాడే—మరొకప్పుడు మంత్రిలా నిలువుగా అడ్డంగా ఐమూలలకు ముందుకూ వెనక్కూ కదుల్తూ ఆల్ పవర్‌ఫుల్‌గా జీవించా లనుకుంటాం. అలా జీవించాలనుకునే మరో మంత్రిలాటి వ్యక్తి తటస్థ పడితే మనకూ వాడికీ హోరాహోరీ యుద్ధం తప్పనిసరి కదా -

బంటు సరైనచోట పడితే ఎలా ఆట టకటక లాడిస్తాడు?

నిజంగా చదరంగం గురించి ఆలోచిస్తే ఈ ప్రపంచంలో అన్ని రంగాలలోనూ పోరాటమే తప్ప సర్వైవల్ లాఫ్‌ది ఫిట్టెస్టు మరొక థీరీ ఏదీ పనికిరాదని చిన్నపిల్లాడికైనా తెలిసిపోతుంది. చదరంగం క్రీడలో అహింస లేదు హింసే వుంది. ఎత్తులు పై ఎత్తులు దవుర్జన్యంకాక మరేవి ఉంది రాజకీయాల్లో కాని జీవితంలో కాని ?

నిన్నగాక మొన్న పాకిస్తానీ వాడితో యుద్ధం. గెలవటానికి రష్యాతో ఒడంబడిక చదరంగపు ఎత్తు కాదూ. భారత ఉపఖండంలో శాంతికి బంగ్లాదేశ్ విముక్తికి మనం సలిపిన పోరాటంలో ఎత్తుగడలేదూ- అమెరికా చైనాలు పాకిస్తాన్‌కు యుద్ధంలో సహాయంగా బలాన్ని దింపి డైరెక్టుగా పోరాటానికి ఎందుకు రాలేకపోయారు? అదీ చదరంగపుటెత్తే— గనుక ప్రపంచాన్ని అగ్రరాజ్యాలు వాటాలు వేసుకొని పంచుకోడానికి యుద్ధాలు అవసరం. ఆమాటకొస్తే అహింసాయుతంగా పోరాడమన్నది కూడా హింసాయుతంగా పోరాటాన్ని కొనసాగించలేక వేసిన గమ్మత్తయిన ఎత్తేకాని అది సర్వరోగ నివారిణికాదు.

ఇంతకీ మీరు చదరంగం ఆడండి. మీకు రాజకీయాలు ఎంత సులువుగా బోధపడతాయో మీ బుద్ధి ఎంత వికసిస్తుందో దానంతటదే మీకు తెలుస్తుంది. వుండండి — మా వారు గుర్రాన్ని తీస్తున్నారు. అది ఏనుగుమీదా, మంత్రిమీదా, రాజుమీదా పడేట్లుంది....